పెన్ పవర్
తెలంగాణ రౌండప్
బుధవారం 23 జూలై 2025 పేజీలు 8

# వెంటనే స్టార్ట్ చేయండి

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంత్రి వివేక్ సూచన



హైదరాబాద్ పెన్ పవర్: ఇందిరమ్మ ఇల్లు వచ్చిన వారు వెంటనే ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని మంత్రి వివేక్ సూచించారు. మంగళవారం (జూలై 22) మెదక్ జిల్లా చేగుంటలో ఆషాడమాస బోనాల పండుగ సందర్భంగా సంద్రగు బ్రదర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఫలహారం బండి ఊరేగింపు వేడుకలో

- మిగతా 3లో...

సచివాలయం నుండి జిల్లా కలెక్టర్‌లతో మంత్రులు వీడియో కాన్ఫరెన్స్..



# రైతులను ఇబ్బంది పెడితే..!

# కఠిన చర్యలు..!

- ఆగస్టు 15 నాటికి భూ సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు..
- పథకాల అమలులో కలెక్టర్‌లదే బాధ్యత..! మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు..!
- ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు..! జిల్లా కలెక్టర్‌లే కీలకంగా వ్యవహరించాలి..!
- తెలంగాణ సచివాలయం నుండి జిల్లా కలెక్టర్‌లతో పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్.
- మంత్రులు పొన్నం ప్రభాకర్,కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు..
- వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి..
- అదనపు కలెక్టర్‌లు రాధికా గుప్తా, విజయేందర్ రెడ్డి పాల్గొన్నారు..



రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి..

## మంత్రి పొంగులేటి జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 22: తెలంగాణ ప్రజల, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన భూ భారతి చట్టం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లదే అంటూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.. మంగళవారం డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్‌లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటితో పాటు, సహచర మంత్రులు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావుతో కలిసి పొంగులేటి పాల్గొన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్‌లు కీలకంగా వ్యవహరించాలని, ఆయా సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరే విధంగా తగు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కూడా కలెక్టర్‌లదే నని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఈ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని, పొంగులేటి కొనియాడారు..

-2లో

## 5 వేల మంది తల్లులకు

# కేసీఆర్ కిట్ల పంపిణీ

### భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



హైదరాబాద్ పెన్ పవర్: కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందని.. రేవంత్ ప్రభుత్వం కేసీఆర్ కిట్లను ఇవ్వడం లేదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. భారత రాష్ట్ర

-3 లో

# ప్రతి ఆడబిడ్డకు నా అభినందనలు.. చాలా హ్యాపీగా ఉంది

హైదరాబాద్ పెన్ పవర్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహాలక్ష్మీ స్కీమ్ ప్రారంభించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాన్ని అమలు చేసింది. 18 నెలలుగా ఎలాంటి ఆటంకం లేకుండా విజయవంతంగా సాగుతోన్న మహాలక్ష్మీ స్కీమ్ అరుదైన మైలురాయిని అందుకుంది. ఈ స్కీములో భాగంగా ఇప్పటి వరకు 200 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. మహాలక్ష్మీ స్కీమ్ ఈ అరుదైన ఘనత అందుకోవడంపై సీఎం రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ పెట్టారు. 18 నెలల ప్రజా పాలనలో 200 కోట్ల జీరో టికెట్ల మైలురాయిని దాటి ఆడబిడ్డల ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా కొనసాగుతుండటం ఆనందంగా ఉందన్నారు. ఈ పథకంలో లబ్ధిదారులైన ప్రతి ఆడబిడ్డకు



అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. ఈ పథకాన్ని దిగ్విజయంగా అమలు చేయడంలో భాగస్వాములైన ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది, యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు సీఎం రేవంత్.

# రైతులను ఇబ్బంది పెడితే..! కఠిన చర్యలు..!





మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్..


మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి..

- మొదటి పేజీ తరువాయి

క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్‌లు అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని, పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఎన్నో పథకాల ఫలితాలను వారికి అందే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.. అందుకు అనుగుణంగా అధికారులు ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని మంత్రులు స్పష్టం చేశారు..

**రైతులను ఇబ్బంది పెడితే..! కఠిన చర్యలు..!**

తెలంగాణ రాష్ట్రంలో మూడు దఫాలుగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడానికి సామాన్యులను, ముఖ్యంగా రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని. సస్పెండ్ చేయడానికైనా వెనుకాడబోమని మంత్రి హెచ్చరించారు.. క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారులు రైతులను ఇబ్బంది పెడుతున్నారనే సమాచారం ఉందని.. మళ్ళీ పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కలెక్టర్‌లదే అన్నారు.. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూ భారతి, వివిధ రెసిడెన్షియల్ స్కూళ్లలో భోజన, మౌలిక వసతుల ఏర్పాటు, వన మహోత్సవంలో మొక్కలు నాటడడం, మహాలక్ష్మి పథకం, తదితర అంశాలపై మంత్రి పొంగులేటి సమీక్షించారు.. రాష్ట్ర మంత్రులు వివిధ అంశాల వారీగా జిల్లా కలెక్టర్‌లకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు కలెక్టర్‌లు అధికారులు నిర్విరామంగా కృషి చేయాలని తెలిపారు..

**రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా..! ప్రతి సోమవారం బిల్లులు చెల్లింపులు జరుపుతున్నప్పటికీ సాంకేతిక సమస్యలతో కొంతమంది లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ కావడం లేదు. ఇటువంటి సమస్యలను ముందుగానే గుర్తించి లబ్ధిదారునికి ఇబ్బంది లేకుండా చూడాలి. డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు వీలైనంత త్వరగా కేటాయించాలని అధికారులను ఆదేశించడం జరిగింది**

## లబ్ధిదారులకి ఉచిత ఇసుక చేరేలా కలెక్టర్‌లు చర్యలు..

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుక లబ్ధిదారులకు చేరేలా కలెక్టర్‌లు చర్యలు తీసుకోవాలి. లబ్ధిదారులపై రవాణా భారం అధికంగా పడకుండా వీలైనంత దగ్గరలోని ఇసుక అందే విధంగా చూడాలి. బేస్‌మెంట్ నిర్మాణం కోసం అక్కడక్కడ అందుబాటులో ఉన్న మట్టిని తీసుకెళ్తున్న లబ్ధిదారులపై పోలీసులు కేసులు నమోదుచేయడం సరైన చర్యకాదు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాలతో సంబంధం లేకుండా నిరుపేదలైతే ఇల్లు కేటాయించాలి.. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్‌లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## సాదాబైనామా అంశంపై మంత్రి స్పష్టత..

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 8.65 లక్షల దరఖాస్తుల్లో ప్రధానంగా సాదాబైనామా, సర్వేనెంబర్ మిస్సింగ్, అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ, సక్సెషన్‌కు సంబంధించి సుమారు 6 లక్షలున్నాయని మంత్రి వివరించారు.. వీటిని ఐదు విభాగాలుగా విభజించి ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి ఆగస్టు 15వ తేదీలోగా వీలైనన్ని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.. సాదాబైనామాల అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని కోర్టు తీర్పుకోసం వేచి చూడకుండా దరఖాస్తులను పరిశీలించి పరిష్కారం కోసం సిద్ధం చేసుకోవాలని కలెక్టర్‌లకు సూచించారు.. జిల్లాల్లోని అసైన్డ్‌ల్యాండ్, లబ్ధిదారుల వివరాలను, ఈనెల 30వ తేదీలోగా ప్రభుత్వానికి పంపించాలి..

## పథకాల అమలులో లబ్ధిదారులకి ఇబ్బందులు తలెత్తకూడదు..

దరఖాస్తుల సంఖ్యను తగ్గించుకోవడానికి ఇష్టానుసారంగా, తిరస్కరించకూడదని, అందుకు గల కారణాలను లిఖిత పూర్వకంగా దరఖాస్తుదారునికి తెలియజేయాలని సూచించారు.. ఈనెల 27న జరిగే జీపీవోలకు, లైసెన్స్‌డ్ సర్వేయర్లకు పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని మంత్రి తెలిపారు..పేదవాడి సొంతింటికల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. చెల్లింపులు, ఇసుక, సిమ్మెంట్, స్టీల్ ధరల విషయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలి. అదేవిధంగా ధరల నియంత్రణ కమిటీ చురుగ్గా పనిచేసేలా కలెక్టర్‌లు నిత్యం పర్యవేక్షించాలని అన్నారు..



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మనుతో జిల్లా అధికారులు..



అదనపు కలెక్టర్‌లతో కలెక్టర్ మను..

## 5 వేల మంది తల్లులకు కేసీఆర్ కిట్ల పంపిణీ

- మొదటి పేజీ తరువాయి

సమితి హయాంలో ఇచ్చిన కేసీఆర్ కిట్లతో మాతా శిశుమరణాలు గణనీయంగా తగ్గి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగాయన్నారు.

తన పుట్టినరోజు సందర్భంగా కేటీఆర్.. 'గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురు తల్లీబిడ్డలకు తెలంగాణ భవన్‌లో మంగళవారం కేసీఆర్ కిట్లను అందించారు. గత 20 నెలల నుంచి ఈ కిట్లను ఇవ్వకపోవడంతో చాలా మంది తల్లులు బాధపడుతున్నారని కేటీఆర్ చెప్పారు. అందుకే ఈనెల 24న తన జన్మదినం సందర్భంగా సిరిసిల్లలో సుమారు 5 వేల మంది తల్లులకు కిట్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. భారత రాష్ట్ర సమితి నేతలు సబిత, మధుసూదనాచారి, ముఠా గోపాల్ పాల్గొన్నారు.

**బీసీల వంచనే కాంగ్రెస్ అసలు నైజం..**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ మోసపూరిత వైఖరినే అనుసరిస్తోందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇంట్లో మంగళవారం అందుబాటులో ఉన్న బీసీ ప్రజాప్రతినిధులతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. "కులగణన జీవో నుంచి గణన ప్రక్రియ వరకు బీసీల సంఖ్యను తగ్గించి చూపడంలో కాంగ్రెస్ దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది. బీసీ డిక్లరేషన్ పేరుతో ఆ పార్టీ ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయకుండా బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తోంది. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పన అంశంలో చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించింది. కోర్టుల పేరుతో, చట్టపరమైన నిబంధనలు చూపిస్తూ తప్పించుకోవడానికి కాంగ్రెస్ రంగం సిద్ధం చేస్తోంది. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల కోసం ప్రారంభించిన పథకాలను రద్దు చేసి.. కొత్త పథకాలు ప్రారంభించకపోవడం ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీ వారికి చేస్తున్న ద్రోహమే" అని ఆరోపించారు. సమావేశంలో భారత రాష్ట్ర సమితి నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, మధుసూదనాచారి, బండా ప్రకాశ్, శ్రీనివాస్‌గౌడ్, పద్మారావుగౌడ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వెంటనే స్టార్ట్ చేయండి

- మొదటి పేజీ తరువాయి

మంత్రి వివేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహంకాళమ్మకు పూజలు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో 12 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ళు తప్ప.. వేరే ఇండ్లే ఇవ్వలేదని గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నామన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు శాంక్షన్ అయ్యాయని.. ఇండ్లు వచ్చిన వారు వెంటనే నిర్మాణం స్టార్ట్ చేయాలని సూచించారు. త్వరలోనే మరో 3500 ఇల్లు రాబోతున్నాయని నియోజకవర్గ ప్రజలకు శుభవార్త చెప్పారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద పేద ప్రజలకు రూ.10 లక్షల వైద్యం అందిస్తున్నామని చెప్పారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రూ.9 వేల కోట్ల రూపాయలతో రేషన్ ద్వారా సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. రూ.23 వేల కోట్లతో రైతులకు ఏకకాలంలో పంట రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. పేద ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు.

# భారీ వర్షాలు.. తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

- భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ
- కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్, మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- వెల్లడించిన వాతావరణ శాఖ సంచాలకురాలు



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో హైదరాబాద్ నగరంతో సహ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.రాష్ట్రంలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ సంచాలకురాలు డాక్టర్ నాగరత్న తెలిపారు. కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు ఆమె వెల్లడించారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తం.. కొత్త పేర్లు కూడా యాడ్ చేస్తం




హైదరాబాద్ పెన్ పవర్: రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామని హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం (జూలై 22) హైదరాబాద్ కలెక్టరేట్?లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ, సీజనల్ వ్యాధులను అరికట్టడంపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మంత్రి పొన్నం రివ్యూ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో 10 సంవత్సరాల తర్వాత కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు. రేషన్ కార్డుల్లో కొత్త పేర్లను కూడా యాడ్ చేసేందుకు అవకాశం కల్పించామని చెప్పారు. హైదరాబాద్?లో 43 వేల కొత్త రేషన్ కార్డులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇంకా లక్షకు పైగా దరఖాస్తులు పెండింగ్?లో ఉన్నాయన్నారు. హైదరాబాద్ జిల్లాల్లో అర్హుల ఎంపిక ప్రక్రియ కొంత ఆలస్యంగా జరుగుతుందని.. పెండింగ్ అప్లికేషన్ ప్రాసెస్ వెరిఫికేషన్ తొందరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశిస్తున్నానన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు. ఎక్కడ జాప్యం చేయకుండా..

సివిల్ సప్లయ్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయం చేసుకొని వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

# ఫ్రీబీస్ ఎఫెక్ట్: ఎవరొచ్చినా.. జనాలకు పండగే.. !



**హైదరాబాద్ పెన్ పవర్:**ఫ్రీబీస్.. ఎన్నికల సమయంలో ప్రజలను మచ్చిక చేసుకునేందుకు.. వారి ఓట్లను దూసుకునేందుకు రాజకీయ పార్టీలు ఇచ్చేహామీలు. ఇవి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో ప్రత్యేకం. ఆయా రాష్ట్రాల ప్రజల అవసరాలు, వారి అభిరుచులు, ప్రత్యర్థుల రాజకీయ స్థాయిలు.. ఇలా అనేక విషయాలు ప్రభావితం చేస్తాయి. వీటిని తట్టుకుని.. ప్రజలను తమవైపు తిప్పుకొనే ప్రయత్నంలోనే పార్టీలు.. ఉచితాలకు ప్రాధాన్యం ఇస్తా యి. ఉత్తరాది రాష్ట్రాల కంటే కూడా..దక్షిణాది రాష్ట్రాల్లో ఈ ఫ్రీబీస్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది.

దీంతో ఎన్నికల వేళ ప్రజలు కూడా తమకు ఏ పార్టీ ఏమిస్తుంది? ఏయే పథకాలను ప్రకటిస్తుంది? అనే విషయాలపై ఆసక్తి చూపుతారు. అంతేకాదు.. ప్రజల మైండ్ సెట్ కూడా ఇప్పుడు ఉచితాలపైనే ఉంది. దీంతో పార్టీలు ఏమాత్రం సంకోచించకుండా పథకాల ప్రకటనకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. చిత్రం ఏంటంటే.. ఒక ప్రభుత్వం ప్రారంభించిన లేదా అమలు చేసిన పథకాన్ని తదుపరి వచ్చే ప్రభుత్వం కూడా కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. లేకపోతే.. ఇబ్బందులు తప్పడం లేదు. ఉదాహరణకు వైసీపీ సర్కారు.. గతంలో టీడీపీ అమలు చేసిన అన్న క్యాంటీన్లను రద్దు చేసింది. ఇది సామాన్యులకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. దీంతో ఎన్నికలకు ముందు.. ఇది పెద్ద నినాదంగా కూడా మారిం ది. ఇక, 2024లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. దీనికి ముందు వైసీపీ అమలు చేసిన పథకాలను అమలు చేయాల్సి వస్తోంది. గతంలో అమ్మ ఒడికి ఇప్పుడు పేరు మార్చి తల్లికి వందనం పేరుతో అమలు చేస్తున్నారు. అలానే.. కొత్త పథకాలకు కూడా శ్రీకారం చుట్టారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇచ్చే పథకం.. వంటివి గత ఏడాది టీడీపీ ప్రకటించిన హామీలు. వీటిలో గ్యాస్ ఫ్రీగా ఇచ్చే కార్యక్రమం అమలవుతోంది. ఉచిత బస్సు పథకం.. వచ్చే నెలలో ప్రారంభం అవుతుంది. అయితే.. చిత్రం ఏంటంటే.. వచ్చే ఎన్నికల నాటికి కూడా ఈ పథకాలు కొనసాగుతాయి. అంతేకాదు.. ఏ ప్రభుత్వం వచ్చినా. వీటిని అమలు చేయకతప్పదు. ఎన్నికల్లో హామీలు కూడా ఇవే ఉంటాయి. గతంలో అమ్మ ఒడిని ప్రకటించిన వైసీపీని డామినేట్ చేస్తూ.. చంద్రబాబు అదే పథకాన్ని ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ ఇస్తామన్నారు. అలానే.. వచ్చే ఎన్నికలు ఎప్పుడు జరిగినా.. ఉచిత పథకాలు మరింత పెరుగుతాయే తప్ప.. తగ్గే పరిస్థితి అయితే కనిపించడం లేదని పరిశీలకులు చెబుతున్నారు. సామాజిక పింఛన్లు పెరుగుతాయి. ఉచిత గ్యాస్ డెలివరీ కొనసాగుతుంది. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, రైతులకు ఆర్థిక భరోసా వంటివి కూడా కొనసాగడం ఖాయం. ఇక, వీటికి మించి ఇంకా ఏమైనా కూడా అమలు చేయొచ్చు.

# నెల్లూరులో మరో కీలక నేత ఔట్.. ఉచ్చుబిగిస్తున్న ప్రభుత్వం



**హైదరాబాద్ పెన్ పవర్:**గత ప్రభుత్వంలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయని, అందుకు బాధ్యులుగా గుర్తిస్తూ పలువురు వైసీపీ నేతలను అరెస్టు చేస్తున్న ప్రభుత్వం తాజాగా మరో ముఖ్య నేతకు ఉచ్చు బిగిస్తోందని ప్రచారం జరుగుతోంది. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలతో వందల కోట్లు పోగేశారని ఆరోపిస్తూ నెల్లూరుకు చెందిన వైసీపీ నేతలను పోలీసులు అరెస్టు చేస్తున్నారు. తాజాగా రుస్తుం మైన్స్ తవ్వకాల్లో ఆ జిల్లాకు చెందిన వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకుడు బిరదవోలు శ్రీకాంత్ రెడ్డిని పోలీసులు హైదరాబాద్ లో అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఇచ్చిన సమాచారంతో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కు ఉచ్చు బిగిస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే ఈకేసులో నెల్లూరు వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి అరెస్టు అయ్యారు. ఇప్పుడు శ్రీకాంత్ రెడ్డి వాంగ్మూలం ఆధారంగా అనిల్ కుమార్ యాదవ్ పైనా చర్యలు తీసుకుంటే నెల్లూరులోని ముఖ్యమైన ఇద్దరు నేతలు ఇరుక్కున్నట్లేనని అంటున్నారు.

సోమవారం హైదరాబాద్ లో వైసీపీ నేత శ్రీకాంత్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. తర్వాత నెల్లూరు తరలించారు. విచారణలో ఆయన ఇచ్చిన సమాచారంతో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అక్రమ వసూళ్లు వెలుగుచూశాయని ప్రచారం జరుగుతోంది. అక్రమ క్వార్ట్జ్ తవ్వకాల్లో సంపాదించిన సొమ్ముతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసినట్లు శ్రీకాంత్ రెడ్డి వెల్లడించినట్లు సమాచారం. మాజీ మంత్రి కాకాణి, అనిల్ కుమార్ యాదవ్ ప్రోద్భలంతో గూడూరు, సైదాపురం, చిల్లకూరు, వెంకటగిరి ప్రాంతాల్లో అనిల్ కుమార్ బ్యాచ్ వేల కోట్ల రూపాయల్లో మామూళ్లు వసూలు చేసినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు.

టన్ను క్వార్ట్జ్ కి రూ.7 వేల నుంచి రూ.10 వేలు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలిందని చెబుతున్నారు. మైనింగు ద్వారా వసూలు చేసిన డబ్బుతో భారీగా భూములు కొనుగోలు చేశారని, గూడూరు, చెన్నూరు రోడ్డులో వందల ఎకరాల భూమిలో రియల్ వెంచర్ వేశారని పోలీసుల విచారణలో బయటపడిందని అంటున్నారు. అదేవిధంగా నాయుడుపేట హైవే వెంట 50 ఎకరాల్లో మరో వెంచర్ వేశారని, హైదరాబాద్ మణికొండ అల్కాపురి టౌన్ షిప్పులోనూ కొన్ని నిర్మాణాలు చేపట్టినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో మాజీ మంత్రి అనిల్ కుమార్ ను అదుపులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది


# 'మైల్ స్టోన్ మూమెంట్'... ఫుల్ జోష్ లో భారత ఆర్మీ ఆసక్తికర కామెంట్స్!




**హైదరాబాద్ పెన్ పవర్:**భారతదేశం తన అమ్ములపొదిని సరికొత్త స్వదేశీ, విదేశీ ఆయుధాలతో నింపుతున్న సంగతి తెలిసిందే. ప్రధానంగా ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత ఆయుధ సంపత్తిపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ నడుస్తోందని అంటున్నారు. ప్రధానంగా మేడిన్ ఇండియా ఆయుధాలపై ప్రపంచంలో చర్చ జరుగుతుందన్ని మోడీ ఇటీవల తెలిపారు. ఈ నేపథ్యంలో ఇండియన్ ఆర్మీ ఓ మైల్ స్టోన్ మూమెంట్ ని తాజాగా పంచుకుంది.అవును... మార్చి 2024లో మొదటి ఆర్డర్ ఇవ్వగా... సుమారు 15 నెలల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఓ మైలురాయి క్షణం ఆవిష్కృతమైంది. భారత సైన్యం సుదీర్ఘ నిరీక్షణ మంగళవారం ముగిసింది. ఇందులో భాగంగా... అపాచీ హెలికాప్టర్ల మొదటి బ్యాచ్ జోధ్ పూర్ లోని హిండన్ ఎయిర్ బేస్ కు చేరుకుంది. మూడు హెలికాప్టర్లు యుఎస్ మిలిటరీ కార్గో విమానం నుండి బయటకు వచ్చాయి. ఇది మన ఆర్మీకి పెద్ద ప్రోత్సాహం అని అంటున్నారు.వాస్తవానికి 2020లో భారత వైమానిక దళానికి బోయింగ్.. 22ఈ మోడల్ అపాచీల డెలివరీని పూర్తి చేసింది. దీంతో 2024లో భారత సైన్యం కోసం ఆరు ఏహెచ్-64ఈలను సరఫరా చేయడానికి ఒప్పందంపై సంతకం చేసింది. ఈ క్రమంలో సుదీర్ఘ నిరీక్షణ తర్వాత తాజాగా ప్రపంచంలోనే అత్యంత అధునాతన మల్టీ రోల్ కంబాట్ హెలికాప్టర్లలో ఒకటైన ఏహెచ్-64ఈ అపాచీ ఛాపర్లు మూడింటిని బోయింగ్ డెలివరీ చేసిం ది.ఈ సందర్భంగా ఇండియన్ ఆర్మీ ఎక్స్ వేదికగా స్పందించింది. ఈ సందర్భంగా... హెలికాప్టర్ల చిత్రాలను పంచుకుంటూ.. ఈ రాకను "మైలురాయి క్షణం"గా అభివర్ణించింది. ఇది ఆర్మీ కార్యాచరణ సామర్థ్యాలను పెంచుతుందని పేర్కొంది. ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన, నిరూపితమైన అటాక్ హెలికాప్టర్ గా బోయింగ్ దీన్ని అభివర్ణించింది.ఈ అపాచీ భారీగా ఆయుధాలు కలిగి ఉంది. ఇందులో భాగంగా షార్ట్ రేంజ్ పోరాటం కోసం 30 ఎంఎం ఎం230 చైన్ గన్.. ఒక ఏరియా అణచివేత కోసం 70ఎంఎం హైడ్రా రాకెట్లు, ఆరు కిలోమీటర్ల దూరం నుండి సాయుధ వాహనాలు, ట్యాంకులను ఛేదించగల ఏజీఎం-114 హెల్ఫైర్ క్షిపణులను ఈ అపాచీ కలిగి ఉంది.కాగా... సుమారు 40 సంవత్సరాలకు పైగా విస్తరించిన వారసత్వంతో అపాచీ 1980ల నుండి ప్రతి ప్రధాన అమెరికా సైనిక ఆపరేషన్ లోనూ కీలక భూమిక పాత్ర పోషించింది. వాస్తవ ప్రపంచ పోరాటంలో తద్దైన ప్రభావాన్ని చూపించింది.

# మాస్ మల్లన్న రూటు మార్చారా? మరేదైనా ప్లాన్ ఉందా?

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ పాలిటిక్స్ లో మల్లారెడ్డి ప్రత్యేక స్టయిల్. విద్యాసంస్థల అధిపతిగా ఆయన కోట్లు సంపాదించినా లభించని తృప్తి రాజకీయాల్లో కేవలం పదేళ్లలోనే రుచి చూశారు. పాల వ్యాపారం నుంచి ప్రారంభమైన మల్లారెడ్డి జీవితం కోటీశ్వరుడిగా మారడానికి విద్యాసంస్థలే కారణం. ఒక్కొక్క మెట్టు పేర్చుకుంటూ మల్లారెడ్డి రాజకీయాల్లోనూ అడుగులు వేస్తున్నారు. 2014 ఎన్నికల్లో రాజకీయాల్లోకి వచ్చి తెలుగుదేశం పార్టీ పార్లమెంటు సభ్యుడిగా మల్కాజ్ గిరి నుంచి పోటీ చేసి విజయం సాధించిన మల్లారెడ్డి తర్వాత రూటు మార్చి బీఆర్ఎస్ లో చేరారు. తర్వాత 2018 ఎన్నికల్లో శాసనసభ్యుడిగా గెలిచిన కేసీఆర్ మంత్రివర్గంలో మంత్రి కూడా అయి ఆయన కలను నెరవేర్చుకున్నారు.




**కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక...**

అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఆయనకు కష్టాలు మొదలయ్యాయి. విద్యాసంస్థలు ఆక్రమిత స్థలంలో నిర్మించారని కొన్ని కూల్చివేతలు జరిగాయి. దీంతో బీఆర్ఎస్ లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలవడంతో ఆదాయపు పన్ను శాఖ దాడులు కూడా జరిగాయి. దీంతో మల్లారెడ్డి తొలినాళ్లలో మాస్ మల్లన్నగా ఉన్నా.. తర్వాత కొంత నెమ్మదించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో మంచిగా ఉంటూ తన వ్యాపారాలను, విద్యాసంస్థలకు ఇబ్బంది కలగకుండా చూసుకుంటున్నారు. బీఆర్ఎస్ అధికారం లో ఉన్నప్పుడు సవాళ్లు చేసిన మల్లన్న తర్వాత చల్లబడి ఇప్పుడు తన నియోజకవర్గానికే పరిమితమయ్యారు. అసలు రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానంటూ మదనపడిన సందర్భాలు కూడా ఉన్నాయి.

**రాజకీయ ఇబ్బందులతోనేనా?**

అలాంటి మల్లన్న రాజకీయాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను ఎదుర్కొనడానికి పెద్ద స్కెచ్ వేసినట్లు తెలిసింది. తాను బీఆర్ఎస్ లో ఎమ్మెల్యేగా ఉన్నాడు. తన అల్లుడు మర్రి రాజశేఖర్ కూడా ఎమ్మెల్యేగా ఉన్నాడు. ఒకే కుటుంబం నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. అయితే తన కోడలిని బీజేపీలోకి పంపేందుకు సిద్ధమయినట్లు కనపడుతుంది. మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి ఇటీవల కేంద్ర మంత్రి బండి సంజయ్ తో కనిపించడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.కేంద్ర మంత్రి బండి సంజయ్ తో భేటీ వెనక మతలబు ఏంటన్న చర్చ జరుగుతుంది. బీజేపీలో ఉంటే కొంత సేఫ్ అని భావించి ప్రీతిరెడ్డిని బీజేపీలో చేర్పించే ప్రయత్నించేందుకు ప్రయత్నిస్తున్నారన్న టాక్ వినపడుతుంది.

**ఈటలతో వివాదంతో...**

ఆదాయపు పన్ను దాడుల నుంచి కాకుండా తన విద్యా సంస్థలను కాపాడుకోవడానికే కోడలిని బీజేపీలోకి పంపే ప్రయత్నాన్ని మల్లన్న చేస్తున్నారన్న టాక్ వినపడుతుంది. కొన్ని ఫ్లెక్సీలు కూడా ఇందుకు కారణమవుతున్నాయి. మరొక వాదన కూడా వినపడుతుంది. బండి సంజయ్ కు, ఈటల రాజేందర్ కు పొసగకపోతుండటంతో మల్కాజ్ గిరి పార్లమెంటు నుంచి వచ్చే ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేయడానికి మల్లారెడ్డి ఇలా ప్లాన్ చేశారా? అన్న చర్చ కూడా జరుగుతుంది. రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చు. సొంత పార్టీలో ఉన్న తమ ప్రత్యర్థికి చెక్ పెట్టడానికి అన్ని రకాల వ్యూహాలు పన్నుతారు. బండి సంజయ్ కూడా అదే దారిలో స్నేహారెడ్డితో భేటీ అయ్యారని కూడా అంటున్నారు. అయితే బండి సంజయ్ తో భేటీ మార్యాదపూర్వకమేనని చెబుతున్నారు. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# భర్తను హత్య చేసి ప్రియుడితో జంప్ అయిన భార్య.. మహారాష్ట్రలో మరో ఘటన

**హైదరాబాద్ పెన్ పవర్:**భర్తను హత్య చేస్తున్న ఘటనలు ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట జరుగుతున్నాయి. భార్యలే విలన్లుగా మారుతున్నారు. భర్తను చంపి ఇంటిలోనే మృతదేహాన్ని పూడ్చిపెట్టిన భార్య ఉదంతం మహారాష్ట్ర జిల్లాలో జరిగింది. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో జరిగిన ఈ ఘటన సంచలనం కలిగించింది. విచిత్రమేంటంటే ఈ హత్యలో కూడా భార్య తన ప్రియుడిని హత్యకు ఉపయోగించుకుంది. వివాహేతర సంబంధం కారణంగానే ఈ హత్య జరిగిందని పోలీసులు నిర్ధారించారు. హత్య జరిగిన విషయం తెలియకుండా పకడ్బందీగా ప్లాన్ వేసింది. రెండు వారాల క్రితం జరిగిన ఈ ఘటన మహారాష్ట్రలో సంచలనం కలిగించింది. ముంబయికి డెబ్బయి కిలోమీటర్ల దూరంలో విజయ్ చవాన్, కోమల్ లు కలసి ఉంటున్నారు.




**ఇద్దరి జీవితంలోకి...**

వీరిద్దరూ వివాహం చేసుకుని జీవిస్తున్నారు. అలాంటి కోమల్ జీవితంలోకి మరొక వ్యక్తి ఎంట్రీ ఇచ్చాడు. తన ఇంటిపక్కనే ఉన్న మోను అనే యువకుడితో పరిచయం ప్రేమగా మారి వివాహేతర సంబంధాలకు దారి తీసింది. ఇద్దరూ కలసి ఉండటాన్ని భర్త విజయ్ చవాన్ చూశాడు. మందలించాడు. దీంతో భర్తకు తమ వివాహేతర సంబంధం తెలియడం, ఇకపై తాము కలుసుకోవడానికి అడ్డంకిగా ఉంటాడని భావించి కోమల్ భర్త విజయ్ చవాన్ హత్యకు ప్లాన్ చేసింది. తన ప్రియుడు మోను తో కలసి హత్యకు వేసిన స్కెచ్ చూసి పోలీసులే అవాక్కయ్యారు.

**వారం రోజుల నుంచి కనిపించకపోవడంతో...**

అయితే విజయ్ చవాన్ వారం రోజుల నుంచి కనిపించకపోవడంతో అతని సోదరులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే కోమల్ హత్య చేసిన తర్వాత విజయ్ చవాన్ తన ఇంట్లోనే గొయ్యి తీసి పూడ్చిపెట్టి తర్వాత మోనుతో కలసి పరారయింది. సోదరులు, స్థానికులతో కలసి కోమల్ ఇంట్లో ఫ్లోరింగ్ రంగుల్లో తేడా ఉండటాన్ని గమనించిన పోలీసులు అనుమానించి ఆ టైల్స్ ను తొలిగించారు. లోపలి నుంచి దుర్వాసన రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మట్టిని తొలగించి మృతదేహాన్ని బయటకు తీశారు. దీంతో కోమల్, మోను కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇద్దరూ హత్య చేసి ఇంట్లోనే పూడ్చి పెట్టి పరారయి ఉంటారని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# శశిథరూర్ ని కాంగ్రెస్ పార్టీలో ఎవరూ ఏమీ అనకూడదా?

**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ కు సొంత పార్టీ నేతల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. ఆయన ఏ పార్టీలో ఉన్నారో తెలుచుకోవాలంటూ పలువురు కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. ఈ సమయంలో... ఆయన తన వైఖరిని మార్చుకునే వరకు కేరళలో జరిగే ఏ పార్టీ కార్యక్రమానికి తనను ఆహ్వానించబోమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె మురళీధరన్ అన్నారు.



ఇదే సమయంలో... కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు కూడా అయిన థరూర్ ను ఇకపై 'మనలో ఒకరు'గా పరిగణించడం లేదని.. అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది పార్టీ జాతీయ నాయకత్వం నిర్ణయిస్తుందని మురళీధరన్ తెలిపారు. ఈ సమయంలో.. మురళీధరన్ వ్యాఖ్యలపై స్పందించిన థరూర్... తనను దూరం పెడతామని చెప్పడానికి ఆయన ఎవరని అన్నారు!

అవును... మురళీధరన్ వ్యాఖ్యలపై స్పందించిన థరూర్... ఇలాంటి వాదనలు చేయడానికి వారి వద్ద ఎలాంటి ఆధారం ఉందని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు చేస్తున్నవారికి పార్టీలో ఏ అధికారం లేదంటూ మురళీధరన్ ను ఉద్దేశించి అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా చాలామంది మాట్లాడుతున్నారని, వాటిన్నింటికీ స్పందించాల్సిన అవసరం తనకు లేదని అన్నారు.

కాగా... పార్టీ ప్రయోజనాల కంటే దేశానికే ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పుకుంటూ శశిథరూర్.. బీజేపీ నేతలతో అంటకాగుతున్నారని, ఆయన ఇప్పుడు కాషాయదళం మనిషి అయిపోయారంటూ కాంగ్రెస్ శ్రేణుల నుంచి ఇటీవల విమర్శలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. అతని ప్రవర్తనపై అధిష్టాణం ఆగ్రహంగా ఉందని తెలిసినా.. లైట్ తీసుకుంటున్నట్లున్నారని అంటున్నారు.

ఈ నేపథ్యంలోనే శశిథరూర్ పై పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు కామెంట్లు చేస్తున్నారని అంటున్నారు. సీ.డబ్ల్యూసీ మెంబర్ కూడా అయిన థరూర్... ఇలా అధిష్టానాన్ని దిక్కరించి మోడీ %డ% కో చుట్టు తిరిగితే, ఎవరూ ఏమీ అనరా అని పలువురు ప్రశ్నిస్తున్నారు! మరి థరూర్ విషయంలో కాంగ్రెస్ అధిష్టాణం ఫైనల్ గా ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది వేచి చూడాలి!

పైగా... పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత థరూర్ ప్రతిస్పందనలపై కాంగ్రెస్ లో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. మలయాళ దినపత్రికలో "అత్యవసర పరిస్థితి"పై ఇందిరా గాంధీని విమర్శిస్తూ రాసిన వ్యాసం తర్వాత థరూర్ పై విమర్శలు పెరిగాయని అంటున్నారు. ఇవన్నీ చేస్తూ.. కాంగ్రెస్ పార్టీ తనను ఏమీ అనకూడదు అన్నట్లుగా థరూర్ స్పందించడం హాస్యాస్పదమని అంటున్నారు!!

## ఆరోగ్యం బాగాలేదు భారత్ వెళతానంటే పాస్‌పోర్టు లాక్కున్నారు: గల్ఫ్ బాధితుడి సెల్ఫీ వీడియో



హైదరాబాద్ పెన్ పవర్:ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన తెలంగాణకు చెందిన ఒక కార్మికుడు, తనకు అనారోగ్యంగా ఉందని చెప్పినప్పటికీ యాజమాన్యం ఇబ్బంది పెడుతోందని తన భార్యకు సెల్ఫీ వీడియో తీసి పంపించాడు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్నముల్కనూర్ గ్రామానికి చెందిన బాలరాజు 7 నెలల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు.ప్రస్తుతం తాను పని చేయలేని స్థితిలో ఉన్నానని సెల్ఫీ వీడియో తీసి భార్యకు పంపించాడు. అనారోగ్యంగా ఉన్నందున ఇంటికి వెళతానంటే యాజమాన్యం తన పాస్‌పోర్ట్, ఇతర సామగ్రిని తీసుకొని ఇబ్బందులు పెడుతోందని ఆ వీడియోలో పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో, తన భర్తను ఎలాగైనా తీసుకురావాలని భార్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

## ఉప రాష్ట్రపతి రాజీనామాపై స్పందించిన ప్రధాని మోదీ..



హైదరాబాద్ పెన్ పవర్:ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం రాత్రి రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు. ఆయన రాజీనామాను రాష్ట్రపతి తాజాగా ఆమోదించారు. ఈ నేపథ్యంలో ఉపరాష్ట్రపతి రాజీనామాపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. ఉపరాష్ట్రపతి సహా వివిధ హోదాల్లో దేశానికి సేవ చేసేందుకు ధన్‌ఖడ్‌కు అనేక అవకాశాలు లభించాయని తెలిపారు. ఆయన మంచి ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రధాని మోదీ స్పెషల్ పోస్టు పెట్టారు.కాగా, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 67(ఎ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. ఇదిలాఉంటే... మరో రెండు సంవత్సరాలు పదవీకాలం ఉండగానే జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చకు దారితీసింది. 2022లో ఎన్డీయే తరపున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేట్ కావడంతో ఆయన బెంగాల్ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. విపక్ష అభ్యర్థి మార్గరేట్ అల్వాపై విజయం సాధించి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 710 ఓట్లకుగాను 528 ఓట్లు గెలుచుకుని 1997 తర్వాత అత్యధిక ఓట్లతో ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వ్యక్తిగా ఆయన రికార్డులకెక్కారు.

# పవన్ కల్యాణ్ ఇక గుడ్ బై చెప్పనున్నారా? ఫుల్లు టైం కేటాయించనున్నారా?




హైదరాబాద్ పెన్ పవర్:జనసేన అధినేత పవన్ కల్యాణ్ సినిమాలకు గుడ్ బై చెప్పే ఆలోచనలో ఉన్నారు. ఆయన ఇక రాజకీయాల్లో పూర్తి కాలం కొనసాగేందుకే నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అందుకే నిన్న హరిహరవీరమల్లు ప్రీ రిలీజ్ ఫంక్షన్ లో గాని, మీడియా సమావేశంలో కాని ఇకపై తాను సినిమాలు చేయకపోవచ్చని చెప్పారు. పవన్ ఫ్యాన్స్ కు నిజంగా నిరాశ పర్చే వార్తే. ఎందుకంటే అతి తక్కువ సినిమాలు చేసి ఎక్కువ అభిమానులను సంపాదించుకున్న పవన్ కల్యాణ్ కు నిజజీవితంలో సినిమాలపై ఆసక్తి లేదు. ఆయన ఎక్కువ కాలం ప్రజాసేవ చేయాలని నిర్ణయించుకుని జనసేన పార్టీ 2014లో ఏర్పాటు చేశారు. 2019 ఎన్నికల్లో దారుణ ఓటమికి గురి కావడంతో ఆయన మనసును మళ్లించుకోవడానికి కొంత కాలం సినిమాల వైపు మళ్లించారు.

**2019 ఎన్నికల ఫలితాల వెంటనే...**

2019 ఎన్నికలు జరిగిన తర్వాత వెనువెంటనే రాజకీయాల్లో తన పరిస్థితి ఏంటో పవన్ కల్యాణ్ తాను తెలుసుకున్నారు. పొరుగు రాష్ట్రమైన తమిళనాడులోనూ కమల్ హాసన్ వంటి స్టార్లు రాజకీయాల్లో రాణించలేకపోవడం, రాజకీయాల్లోకి వచ్చేందుకు అన్నీ సిద్ధం చేసుకుని వెనక్కు తగ్గిన రజనీకాంత్ ను చూసిన తర్వాత పవన్ కల్యాణ్ ఆలోచనల్లో మార్పు వచ్చిందని చెబుతున్నారు. తాను కీలక పదవిలో లేకపోయినా ఏపీ రాజకీయాల్లో ముఖ్య భూమిక పోషించాలన్న భావనతో ఆయన 2019 ఎన్నికల తర్వాత ఏమాత్రం ఆలోచించకుండా వెంటనే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో జత కట్టారు. అయితే ఏపీలో బీజేపీకి పెద్దగా ఓటు బ్యాంకు లేకపోవడంతో ఆయన టీడీపీతో సన్నిహితంగా మెలగాలని కోరుకున్నారు.

**జగన్ ను మళ్లీ ఓడించాలంటే...**

జగన్ ను ఓడించాలంటే కేంద్రంలో అధికారంలో ఉన్నా పార్టీ మద్దతు అవసరం. ఓటు బ్యాంకు లేకపోయినా ఎలక్షనీరింగ్ చేయాలంటే బీజేపీ సహకారం అవసరమవుతుందని గ్రహించారు. ఇక టీడీపీ విషయానికి వస్తే క్షేత్రస్థాయిలో బలంగా ఉన్న పార్టీ, ఓటు బ్యాంకు భారీగా కలిగిన పార్టీగా, యాభై వసంతాల చరిత్ర కలిగిన పార్టీగా దానిని కూడా కూటమిలో కలుపుకుంటే జగన్ ను కొట్టేయవచ్చన్న నమ్మకంతోనే కూటమిని ఏర్పాటు చేసి సక్సెస్ అయ్యారు. ఇక రానున్న కాలంలోనూ కూటమికి తిరుగులేదని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. తాను ముఖ్యమంత్రిగా కాకపోయినా సరే.. చంద్రబాబు నేతృత్వంలో ఏర్పాటయ్యే ప్రభుత్వంలో కీలకంగా మారాలన్నది మాత్రం పవన్ ఆలోచనగా ఉంది. అందుకే పవన్ కల్యాణ్ కూటమిని సజావుగా వచ్చే ఎన్నికల వరకూ మనస్పర్థలు తలెత్తకుండా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇక సినిమాలకు స్వస్తి చెప్పి ఫుల్ టైం రాజకీయాల్లోనే ఉంటారట.

# విటమిన్ డి మోతాదు మించితే ఏం జరుగుతుంది?

- ఆరోగ్య పరిరక్షణకు అత్యంత కీలకమైనది విటమిన్ డి
- ఆహారం ద్వారా విటమిన్ డి అందనప్పుడు ఇంజెక్షన్లతో చికిత్స
- డోస్ ఎక్కువైతే గుండె సంబంధిత సమస్యలు




హైదరాబాద్ పెన్ పవర్:ఆరోగ్యానికి అత్యంత కీలకమైనది విటమిన్ డి. చాలామందిలో ఇది లోపించినప్పుడు అనేక అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. అందుకే విటమిన్ డి తక్కువగా ఉన్నప్పుడు లేదా ఆహారం ద్వారా సరిగ్గా అందనప్పుడు డాక్టర్లు విటమిన్ డి ఇంజెక్షన్లు ఇస్తారు. ఇవి సాధారణంగా సురక్షితమే అయినా, కొన్ని విషయాలు మనం తెలుసుకోవాలి. ఇంజెక్షన్ వేసిన చోట నొప్పి లేదా కొద్దిగా వాపు రావచ్చు. ఇది కాకుండా, కొందరికి వాంతులు, తలనొప్పి, కళ్లు తిరగడం, మలబద్ధకం వంటివి కూడా ఉండొచ్చు. ఇవి సాధారణంగా కనిపించే సైడ్ ఎఫెక్ట్స్ మాత్రమే. అయితే, విటమిన్ డి ఇంజెక్షన్లు ఎక్కువ మోతాదులో లేదా తరచుగా తీసుకుంటే కొన్ని సమస్యలు వస్తాయి.

ఎక్కువ విటమిన్ డి తీసుకోవడం వల్ల శరీరంలో కాల్షియం స్థాయిలు పెరిగిపోతాయి. దీని వల్ల అలసట, గందరగోళం, డీహైడ్రేషన్ (శరీరంలో నీరు తగ్గడం), కిడ్నీలో రాళ్లు మరియు గుండెకు సంబంధించిన సమస్యలు కూడా రావొచ్చు.

విటమిన్ డి మన ఎముకలకు కాల్షియం అందేలా చేస్తుంది. కానీ, విటమిన్ డి ఎక్కువగా ఉంటే, ఈ కాల్షియం రక్తనాళాలలో (నరాలలో) కూడా పేరుకుపోతుంది. దీన్ని ఆర్టెరియల్ కాల్సిఫికేషన్ అంటారు. దీని వల్ల నరాలు గట్టిపడి, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అందుకే, విటమిన్ డి ఇంజెక్షన్లు తీసుకోవాల్సినప్పుడు డాక్టర్ సలహా తప్పనిసరి. మీకు గుండె జబ్బులు, కిడ్నీలో రాళ్లు లేదా రక్తంలో కాల్షియం ఎక్కువ ఉన్నట్లయితే, ఇంజెక్షన్లు తీసుకునేటప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలి. దీర్ఘకాలం లేదా అధిక మోతాదులో ఇంజెక్షన్లు తీసుకుంటే, వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఉండటం చాలా ముఖ్యం.

# ఐదు రోజులు కుండ పోత వర్షాలు తప్పవట... ఈ జిల్లావాసులు జాగ్రత్తగా ఉండాల్సిందే




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో రాగల ఐదు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్ లు, మరికొన్న జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ లు జారీ చేసింది. ఈనెల 24వ తేదీ నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని, దీని ప్రభావంతో భారీ నుంచి అతిభారీవర్షాలు కొన్నిజిల్లాల్లో పడే అవకాశముందని, కొన్నిజిల్లాలో మోస్తరు వర్షాలు పడతాయని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూడా వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. అలాగే బలమైన ఈదురుగాలులు వీస్తాయని, గంటలకు నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని కూడా వాతావరణ శాఖ తెలిపింది.

**అతి భారీ వర్షాలు ఇక్కడ...**

తెలంగాణాలో ఐదు రోజుల పాటు భారీ నుంచి మోస్తరు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. కొన్నిజిల్లాల్లో అతి భారీ వర్షాలు పడతాయని తెలిపింది. అతి భారీ వర్షాలుపడనున్న జిల్లాలుగా కామారెడ్డి, సిద్ధిపేట్, జనగాం, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల్, కుమ్రంభీం ఆసిఫాభాద్, ఆదిలాబాద్ లను పేర్కొంది. ఈ జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడతాయని తెలిపింది. ఈ జిల్లాలకు హైదరబాద్ వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. నాగర్ కర్నూలు,మహబూబ్ నగర్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, హైదరబాద్, రంగారెడ్డి, భువనగిరి, సూర్యాపేట్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిని భారీ వర్షాలు పడతాయని తెలిపింది.

**ఏపీలో ఇక్కడ భారీ వర్షాలు...**

ఆంధ్రప్రదేశ్ లోనూ రానున్నఐదు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని విశాఖ వాతావరణ కేంద్రంహెచ్చరించింది. గంటకు నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని పేర్కింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంపడుతుందని తెలిపింది.

రానున్న ఇరవై నాలుగు గంటల్లో పల్నాడు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడే అవకాశముందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, కృష్ణా, జిల్లాల్లో వర్షాలు పడతాయని చెప్పింది. రాయలసీమలో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరువర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

# గుడ్ న్యూస్.. ఏపీలో ఉచిత ఇంటి స్థలం కావాలా? అయితే ఈ అర్హతలు ఖచ్చితంగా ఉండాల్సిందే

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉచితంగా ఇంటి స్థలాలు పేదలకు పంచేందుకు సిద్ధమయింది. ఇందుకోసం విధివిధానాలను నిర్ణయించింది. జీవో నెంబరు 23 ప్రకారం ఉచిత ఇంటి స్థలాలు పొందాలంటే అర్హతలు కొన్ని ఉండాలని, అర్హత కలిగిన వారికి మాత్రమే గ్రామీణ ప్రాంతంలో గరిష్టంగా మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు స్థలాన్ని కేటాయించాల్సి ఉంది. అయితే తాజాగా మార్గదర్శకాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసింది. ఈ అర్హతలున్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం కేటాయించే స్థలంలో ఇంటి నిర్మాణానికి కూడా అవసరమైన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూరుస్తాయని ఏపీ ప్రభుత్వం తెలిపింది.




**అర్హతలివే...**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఉచితంగా ఇంటి స్థలాలు రాష్ట్రంలో అర్హులైన పేదలకు కేటాయించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గరిష్టంగా 3 సెంట్ల భూమి, పట్టణ ప్రాంతాల్లో గరిష్టంగా 2 సెంట్ల భూమి కేటాయించనున్నారు. లబ్ధిదారుడు తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండటమే కాకుండా లబ్ధిదారుడు ఆంధ్రప్రదేశ్‌కి చెందినవారై ఉండాలి. కుటుంబంలో ఎవరికి అయినా ఇంటి స్థలం ఉండకూడదు. ప్రభుత్వ ఉద్యోగులు/పెన్షనర్లు అర్హులు కారు. . ఇప్పటికే భూమి ఉన్నవారికి కేటాయింపు జరగదు. ఆధార్, రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాలి . ఇంటి స్థలం ఇప్పటికే ప్రభుత్వ పథకాల ద్వారా పొందినవారు మళ్లీ అర్హులు కారని మార్గదర్శకాల్లో పేర్కొంది.

**రెండు సంవత్సరాల్లోనే...**

అలాగే మైనర్లకు ఉచిత స్థలం ఇవ్వరు. మున్సిపాలిటీల్లో ప్రభుత్వ భూముల లభ్యత ఉన్నచో మాత్రమే స్థలాన్ని కేటాయిస్తారు. స్థలం లేని చోట ఏపీటీఐడీసీఓ మరియు ఇతర ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా నిర్మాణాలు చేయనున్నారు. స్థలానికి లీగల్ ఇబ్బందులు ఉండకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలి. కుటుంబానికి ఒకరికి మాత్రమే ఇంటి స్థలం లభిస్తుంది. గిరిజనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. స్థలం కేటాయించిన తర్వాత రెండు సంవత్సరాల్లో ఇంటిని నిర్మించుకోవాలి.ఇంటి స్థలాన్ని వేరేవారికి అమ్మడం, ఇవ్వడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. . స్థలాల లేఅవుట్ సర్వే, అప్రమత్తంగా చేయాలని, ప్రతి లబ్ధిదారునికి స్థలం కేటాయింపు పట్టా ఇవ్వాలని, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక జరగాలని పేర్కొంది.

**అభ్యంతరాలను...**

గ్రామ సచివాలయం ద్వారా పరిశీలన నిర్వహించాలని, ఎంపికైన లబ్ధిదారుల జాబితా గ్రామంలో ప్రదర్శించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. . అభ్యంతరాలుంటే గ్రామ సభలో పరిష్కరించాలని కూడా ప్రభుత్వం పేర్కొంది. ఖాళీ భూములు సేకరించడానికి ప్రైవేట్ భూములు కొనుగోలు చేయవచ్చని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది. కుటుంబ ఆదాయం రూరల్ ఏరియాలో 10,000 పట్టణ ప్రాంతాల్లో 12,000 లోపల ఉండాలి. అర్హత కలిగిన మహిళల పేర మీద స్థలం కేటాయించాలి. స్థలంలో స్వయంగా నివసించాల్సిన నిబంధన కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఓపెన్ ప్లాట్లు, అందుబాటులో ఉన్న స్థలాలు మాత్రమే ఇచ్చేందుకు వీలుంది.. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

## రూ. 199 కోట్ల విరాళాలపై పన్ను మినహాయింపు.. కాంగ్రెస్ పార్టీకి చుక్కెదురు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదాయపు పన్ను మినహాయింపు విషయంలో కాంగ్రెస్ పార్టీకి మరోసారి నిరాశ ఎదురైంది. రూ. 199 కోట్ల విరాళాలపై పన్ను మినహాయింపు కోరుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన విజ్ఞప్తిని ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఐటీఏటీ) తిరస్కరించింది. రిటర్నులు ఆలస్యంగా దాఖలు చేయడం నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని, చట్టం ప్రకారం మొత్తం ఆదాయానికి పన్ను చెల్లించాలని స్పష్టం చేసింది. 2017-18 సంవత్సరానికి సంబంధించి ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలుకు గడువు తేదీ 2018 డిసెంబర్ 31తో ముగిసింది. కాంగ్రెస్ పార్టీ నిర్ణీత గడువులోగా రిటర్నులు దాఖలు చేయడంలో విఫలమైంది. ఆ పార్టీ 2019 ఫిబ్రవరి 2న రిటర్నులు దాఖలు చేస్తూ, రూ. 199 కోట్లు పన్నుల రూపంలో వచ్చాయని పేర్కొంటూ పన్ను మినహాయింపు కోరింది. 2019లో ఐటీ అధికారులు పరిశీలన జరిపినప్పుడు, దాతల నుంచి అధిక మొత్తంలో విరాళాలు స్వీకరించినట్లు గుర్తించారు. ఒక్కొక్కరి నుంచి గరిష్ఠంగా రూ. 2 వేల వరకు మాత్రమే విరాళం తీసుకోవాల్సి ఉండగా, రూ. 14.49 లక్షలను నగదు రూపంలో స్వీకరించినట్లు కనుగొన్నారు. దీంతో ఐటీ శాఖ పన్ను మినహాయింపు విజ్ఞప్తిని తిరస్కరించింది. ఆ మొత్తానికి పన్ను చెల్లించాలంటూ నోటీసులు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని కమిషన్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ (అప్పీల్స్) సమర్థించింది. కాంగ్రెస్ పార్టీ ఇన్‌కమ్ ట్యాక్స్ అప్పీలేట్ ట్రైబ్యునల్‌కు వెళ్లినప్పటికీ అక్కడ కూడా ప్రతికూల ఫలితమే ఎదురైంది.

## భరణం కింద బీఎండబ్ల్యూ కారు కావాలన్న మహిళ... సొంతంగా సంపాదించుకోవాలమ్మా! అంటూ సీజేఐ హితవు

**హైదరాబాద్ పెన్ పవర్:**విడాకుల కేసులో భరణం కింద ముంబైలో ఓ లగ్జరీ ఫ్లాట్, రూ.12 కోట్ల నగదు, బీఎండబ్ల్యూ కారు కోరిన ఓ మహిళకు సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టింది. అన్ని సామర్థ్యాలు ఉండి ఇలా అడగడమేంటి... సొంతంగా సంపాదించుకోవాలమ్మా అంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ హితవు పలికారు. ఈ కేసు సుప్రీంకోర్టులో విచారణకు వచ్చినప్పుడు, కేవలం 18 నెలల వివాహ జీవితం కోసం ఇంత భారీ మొత్తం భరణం కోరడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఐటీ నిపుణురాలై, ఎంబీఏ పట్టా సాధించిన ఆ మహిళ, తన భర్త ధనవంతుడని, అతను తనను అన్యాయంగా విడిచిపెట్టాడని వాదించింది. అయితే, జస్టిస్ గవాయ్, “మీరు బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో సులభంగా ఉద్యోగం సంపాదించవచ్చు. ఇంత చదువుకున్న మీరు ఇలా భరణం కోసం అడగడం సరికాదు. సొంతంగా సంపాదించుకుని జీవించాలి” అని అన్నారు. “18 నెలల వివాహానికి నెలకు రూ.1 కోటి భరణం, బీఎండబ్ల్యూ కారు కోరడం సమంజసం కాదు” అని ఆయన పేర్కొన్నారు. భర్త తరఫు న్యాయవాది సీనియర్ అడ్వొకేట్ మాధవీ దివాన్, “మహిళ కూడా తన జీవనోపాధికి తానే బాధ్యత వహించాలి. అన్నీ డిమాండ్ చేయడం సరికాదు” అని వాదించారు. భర్త గతంలో సిటీబ్యాంక్ మేనేజర్‌గా పనిచేసినప్పటికీ, ప్రస్తుతం అతని ఆదాయం తగ్గినట్లు ఆయన న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఈ కేసులో తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసింది.

# మంగళవారం షాకిచ్చిన పసిడి.. ధరలు ఎంత పెరిగాయంటే?




**హైదరాబాద్ పెన్ పవర్:**పసిడి ప్రియులకు వరసగా ధరలు షాకిస్తున్నాయి. పెరుగుతూనే పోతున్నాయి. ధరలు ఏమాత్రం తగ్గడం లేదు. ఎందుకన్న కారణాలు పక్కన పెడితే ధరలు పెరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. పసిడి ధరలు మరింతగా పెరుగుతూ వినియోగదారుల ఆశలను గల్లంతు చేస్తున్నాయి. పసిడి ధరలు ప్రతి రోజూ పెరగడం వల్ల కొనుగోళ్లు కూడా దారుణంగా తగ్గాయి. సీజన్ తో సంబంధం లేకుండా పెరిగే ఏకైక వస్తువు బంగారం మాత్రమే. బంగారానికి ఒక రోజు లేదు. ఒక సీజన్ ఉండదు. దాని ధరలు పెరగాలనుకున్నప్పుడు డిమాండ్ కూడా పెద్దగా అడ్డురాదు. అందుకే గోల్డ్ ధరలు పెరగడంతో ఇక కొనుగోళ్లు మరింత తగ్గుతాయని అంచనాల వినపడుతున్నాయి.

**అనేక కారణాలతో...**

బంగారం ధరలు పెరగడానికి అనేక కారణాలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ లో ధరల ఒడిదుడుకులు, ద్రవ్యోల్బణం, డాలర్ తో రూపాయి తగ్గుదల, విదేశాల్లో నెలకొన్న మాంద్యం, యుద్ధాలు, దిగుమతులు తగ్గడం వంటి కారణాలతో బంగారం ధరల్లో హెచ్చుతగ్గులుంటాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో డిమాండ్ లేకపోయినా సరే ధరలు పెరుగుతూ వస్తుండటంతో కొనుగోళ్లు నిలిచిపోయినా ధరలు అదుపులోకి రాకపోవడానికి కూడా కారణం బంగారం ముడి సరుకు కొరత కారణమని చెబుతున్నారు. రానున్న కాలంలో బంగారం, వెండి ధరలు మరింత పెరుగుతాయే తప్ప తగ్గే అవకాశం లేదంటూ అంచనాలు బలంగా వినపడుతున్నాయి.

**వెండి మాత్రం...**

పసిడి పది గ్రాముల ధర ఇప్పటికే లక్ష రూపాయలు దాటేసింది. వెండి కూడా భారీగా పెరిగింది. మరో మూడు రోజుల్లో శ్రావణ మాసం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ధరలు పెరగడం ఆందోళనకు గురి చేస్తుంది. ఈరోజు దేశంలో బంగారం ధరలు పెరిగాయి. వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి. పది గ్రాముల బంగారం ధరపై 130 రూపాయల వరకూ పెరిగింది. ఉదయం ఆరు గంటలకు హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో నమోదయిన బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 91,180 రూపాయలకు చేరింది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,00,160 రూపాయలుగా నమోదయింది. కిలో వెండి ధర 1,25,900 రూపాయలుగా ట్రేడ్ అవుతుంది.

## ఫ్రిజ్‌లో ఉంచిన మాంసాన్ని వేడి చేసి తిని ఒకరి మృతి, ఏడుగురికి అస్వస్థత




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలో బోనాల వేళ విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఫ్రిజ్‌లో ఉంచిన మాంసాహారాన్ని వేడి చేసి భుజించడంతో ఒక వ్యక్తి మృతి చెందగా, ఏడుగురు ఆసుపత్రి పాలయ్యారు. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్‌కుంటలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, చింతల్‌కుంట ఆర్టీసీ కాలనీలో నివాసముంటున్న శ్రీనివాస్ యాదవ్ ఆదివారం నాడు ఇంటికి మటన్, బోటి తీసుకువచ్చారు. దానిని రాత్రి వండుకుని కుటుంబ సభ్యులతో కలిసి భుజించారు. మిగిలిన మాంసాహారాన్ని ఫ్రిజ్‌లో భద్రపరిచారు.సోమవారం నాడు ఫ్రిజ్‌లో ఉంచిన మాంసాహారాన్ని తిరిగి వేడి చేసి కుటుంబ సభ్యులు తిన్నారు. ఆ ఆహారం విషపూరితం కావడంతో వారికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. వెంటనే వారిని సమీపంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీనివాస్ యాదవ్ సోమవారం ఉదయం మృతి చెందారు. మిగిలిన ఏడుగురు కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉప రాష్ట్రపతి రాజీనామాకు.. మోదీ పదవీ విరమణకు లింకేమిటి?




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయ రిటైర్ మెంట్ పై మరింత ఒత్తిడి పెరుగుతున్నట్లుంది. భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రాజీనామాతో రాజకీయ నేతలపదవీ విరమణపై మరోసారి చర్చ మొదలయింది. జగదీప్ ధనఖడ్ తన 74 వ సంవత్సర్సరంలో పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే కేవలం వైద్యుల సూచనల మేరకు తనకు అనారోగ్య కారణాల వల్లనే ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అయినా సరే మళ్లీ ఈ రాజీనామా మోదీ రిట్యటర్ మెంట్ పైకి మళ్లింది. మోదీకి ఇప్పటికే 75 ఏళ్ల వయసు రావడంతో ఆయన రాజకీయాల నుంచి తప్పుకుంటారా? లేదా? అన్నది దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతుంది. సోషల్ మీడియాలో కూడా చర్చ మొదలయింది.

**మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలతో...**

రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు డెబ్బయి అయిదేళ్లకే పదవీ విరమణ చేయాలంటూ ఇటీవల ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సూచించారు. దీంతో ధనఖడ్ 74ఏళ్లకు రిటైర్ అయ్యారని, మిగిలిన వారూ అనుసరించాలని కొందరు సూచిస్తున్నారు. వయసు కంటే సంకల్పం ముఖ్యమని మరికొందరు వాదిస్తున్నారు.75 ఏళ్ల తర్వాత స్వచ్ఛందంగా రాజకీయాల నుంచి తప్పుకోవాలని ఆయన కోరడంతో అది మోదీని ఉద్దేశించిందేనన్న కామెంట్స్ బలంగా వినిపించాయి. ఇప్పుడు 74 ఏళ్లకు ఉప రాష్ట్రపతిగా జగదీప్ ధన్ ఖడ్ రాజీనామా చేయడంతో మరోసారి పదవీ విరమణపై చర్చ మొదలయింది. జూలై 9న నాగ్‌పూర్‌లో జరిగిన సమావేశంలో మోహన్ భగవత్ మాట్లాడుతూ రాజకీయ నాయకులు ఎవరైనా సరే 75 ఏళ్లు నిండగానే పదవీ విరమణ చేయాలని అన్నారు.

**ఈ ఏడాదిలో 75 ఏళ్లు నిండి...**

ప్రధాని నరేంద్ర మోదీకి కూడా ఈ ఏడాది 75 ఏళ్లు నిండి 76వ ఏటకు అడుగుపెట్టనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 2014, 2019, 2024 ఎన్నికల్లో వరసగా బీజేపీని అధికారంలోకి తెచ్చారు. ఆయన చరిష్మాకారణంగానే హ్యాట్రిక్ విజయాలు లభించాయంటున్నారు. అయితే మోదీని ఉద్దేశించి ఆర్ఎస్ఎస్ చీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారా? లేక సాధారణంగా చేసిన వ్యాఖ్యలు మోదీకి అనువదించారా? అన్నది తేలాల్సి ఉన్నప్పటికీ చర్చ మాత్రం మోదీ చుట్టూ తిరుగుతూనే ఉంది. ఈ ఏడాది సెప్టంబరు 17 నాటికి మోదీకి 75 ఏళ్లు నిండుతాయని, ఆయన కూడా రిటైర్ మెంట్ విషయాన్ని ఆలోచించాలని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ఎక్స్ లో పోస్టు కూడా పెట్టారు. గతంలో అద్వానీ, వెంకయ్యనాయుడు, యడ్యూరప్పలను ఇదే వయసు అంశంపై తప్పించిన విషయాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. మరోసారి రిటైర్ మెంట్ అంశం మోదీపైకి మళ్లిందనే చెప్పాలి.